



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

నెరవేరని హామీలు

- పరిష్కారం కాని సమస్యలు
- నేడు జిల్లాలో సిఎం జగన్ పర్యటన

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో జిల్లాకు సంబంధించి పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఆ హామీలు నెరవేరలేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర చేపట్టిన జగన్ శుక్రవారం కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే ఎన్నికల ప్రచారం కోసం వస్తుండడంతో పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర చేపడుతున్నారు. ఈ బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. కర్నూలు, కోడుమూరు మీదుగా ఎమ్మిగనూరు చేరుకుని అక్కడ బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో జిల్లాకు సంబంధించి పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఆ హామీలు నెరవేరలేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఐదేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వస్తుండడంతో పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుండ్రేవుల ఏది..?

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మిస్తానని 2017 నవంబర్ 27న జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో టిడిపి ఓడిపోయింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

నీటిని మరిచారు

దశాబ్దాలుగా కోడుమూరు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. వైసిపి అధికారం చేపట్టిన నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైప్‌లైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు. ఎల్‌ఎల్‌సిని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు. ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. 15 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు. కెసి ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు.

ఆగని వలసలు

వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలో వలసలు ఆగడం లేదు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల నుంచి ఏటా వలసలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జిల్లా నుంచి 2 లక్షల మంది వలస వెళ్తున్నారు.

హైకోర్టుకు పడని అడుగులు

కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటిస్తూ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడుస్తున్నా హైకోర్టు ఏర్పాటుకు అడుగులు పడడం లేదు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథ గట్టు వద్ద హైకోర్టు కోసం 200 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అక్కడితో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రతిపక్షాలు హైకోర్టు ఏర్పాటుకు అడ్డుపడుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏది..?

జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ భూమిపూజకే పరిమితమైంది. ప్రాసెసింగ్ యూనిట్ వస్తే కాస్త ధర దక్కుతుందన్న రైతన్నకు నిరాశే ఎదురవుతోంది. చిత్తూరు జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమోటాను అత్యధికంగా క్రయవిక్రయాలు సాగుతాయి. పత్తికొండ నుంచి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. టమోటా సాగు ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతంలో టమోటా జ్యూస్, సాస్ తయారు చేసేలా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు వైఎస్.జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మూడేళ్లు దాన్ని పట్టించుకోలేదు. జూన్ 1న ముఖ్యమంత్రి పత్తికొండలో పర్యటించిన సందర్భంగా టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని మళ్లీ ప్రకటించారు. సెప్టెంబర్‌లో పత్తికొండ శివార్లలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కోసం మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రాంతంలో అధికారులు భూమిపూజ కూడా చేశారు. యూనిట్ నెలకొల్పేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అక్కడి నుంచి ముందుకు కదలలేదు.

పోలింగ్ కేంద్రాల్లో

మౌలిక సదుపాయాల కల్పన

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన
- నోడల్ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై నోడల్ అధికారులతో చర్చించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు లైట్లు, ఫ్యాన్స్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో బాత్‌రూమ్‌తో పాటు టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాత్ రూమ్‌లకు అమర్చే డోర్స్‌ను రెండు రోజుల లోపు ఏర్పాటు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ వారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమీక్ష

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుండి ఎంసిసి అమలుకు సంబంధించి వచ్చే నివేదికలకు, ఇతర మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను గమనిస్తే చాలా తేడా ఉందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీముల నివేదికలను సివిజిల్ యాప్ లో వస్తున్న ఫిర్యాదులతో, న్యూస్ ఛానళ్లు, పత్రికల్లో వస్తున్న ప్రతికూల వార్తలతో కౌంటర్ చెక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అందులో వచ్చిన వాటిని ఎఫ్ఎస్‌టిటీమ్ లు రిపోర్ట్ చేస్తున్నారా? లేదా? అనే విషయంపై సంబంధిత ఎఫ్ఎస్‌టి టీంలతో సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. సి విజిల్ యాప్‌లో ఎంసిసి ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదు చేసిన ప్రజల ఐడెంటిటీ రహస్యంగా ఉంచాలని, అలా కాకుండా వారి ఐడెంటిటీని ఇతరులకు తెలిపి సంబంధితులకు హాని కలిగించినట్లయితే టీములు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈనెల30, ఏప్రిల్ 1తేదీలలో బూత్ లెవెల్ అధికారులకు, సెక్టోరియల్ అధికారులకు నిర్వహించాల్సిన శిక్షణ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ఎవరైతే ఉద్యోగులు మినహాయింపు కోరుతున్నారో అలాంటి వారి కోసం మెడికల్ క్యాంపులను నిర్వహిస్తామన్నారు.

దీర్ఘకాలిక వ్యాధగ్రస్తులకు మినహాయింపు

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదవతరగతి మూల్యాంకనం విధులకు అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను , దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి విన్నవించారు. వారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్‌కు యుటిఎఫ్ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటిలతో పాటుఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శిలు తిమ్మన్న, దుర్గాప్రసాద్ , రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు వెల్దుర్తి మండల ప్రధాన కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఉపాధ్యాయులకు మూల్యాంకనం నుండి మినహాయించాలన్నారు. మూల్యాంకన కేంద్రంలో నీటి సౌకర్యం, గదిలో సౌకర్యం సిబ్బందికి తగినంతగా ఉండాలన్నారు. పరీక్ష పేపర్లకు సంబంధించిన రెమ్యూనరేషన్, మూల్యాంకనం అనంతరం వెంటనే చెల్లించాలని, గత సంవత్సరాలకు సంబంధించి స్పాట్ వాల్యూయేషన్ రెమ్యూనరేషన్ ఇంకా అందరి ఉపాధ్యాయులకు వెంటనే అందించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాణ్యం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు పాణ్యం నియోజకవర్గ ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణపై మీడియా ప్రతినిధులతో ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని పాణ్యం నియోజకవర్గ ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రెండు జిల్లాలలో ఉన్నందున పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కర్నూలులోనే పాణ్యం నియోజకవర్గం ఆర్వోగా తాను స్వీకరిస్తామన్నారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశామని, పాణ్యం నియోజకవర్గనికి సంబంధించిన స్ట్రాంగ్ రూములను , కౌంటింగ్ సెంటర్లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 3,22,494 మంది ఓటర్లు ఉండగా 1,57,113 మంది పురుషులు,1,65,306 మంది స్త్రీలు, 75 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారన్నారు. ఈ నియోజకవర్గంలో మహిళా ఓటర్స్ ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. 18-19 సంవత్సరాల వయసు కలిగిన యువ ఓటర్లు పాణ్యం నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో 149 లొకేషన్‌లో 357 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అందులో 214 కల్లూరు, 58 ఓర్వకల్లు, 43 పాణ్యం,42 గడివేములలో ఉన్నాయన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 64 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లుగా గుర్తించామన, పోలింగ్ స్టేషన్లో అదనపు పోలీసు బలగాలు ఉంటాయని, అంతే కాకుండా సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ కస్తూరిబా లోని 2 పోలింగ్ స్టేషన్లను, పాలకొల్లులోని ఒక పోలింగ్ స్టేషన్‌ను మొత్తం మూడు పోలింగ్ స్టేషన్లను వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లు గా గుర్తించామన్నారు. రాజకీయ పార్టీల వారు వారి ప్రచారానికి ముందస్తు పర్మిషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఎంసిసి నియమాలను ఉల్లంఘించిన నలుగురు వాలంటీర్లను సస్పెండ్ చేశామన్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల దష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. అత్యవసర సమావేశమైనట్లయితే ఒక్కరోజు ముందుగానే మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామన్నారు. ఓటర్ల జాబితాలో ఇప్పటినుండి డిలేషన్స్ ఉండవని, ఫార్మ్ 6 ద్వారా ఆడిషన్స్ ఉంటాయని అది కూడా 18 సంవత్సరాలు నిండిన యువత వారి ఓటును నమోదు చేసుకొని ఓటును సద్వినియోగం చేసుకునేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. 85 సంవత్సరాల వయసు నిండి బెడ్ రెస్ట్‌లో ఉన్నవారు, ఫారం 12డి ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అసెంబ్లీలో పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షలు దాటకుండా ఖర్చు చేయవలసి ఉంటుందన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నారపురెడ్డి మౌర్య

నిర్భయ ఓటు హక్కుకోసం

సాయుధ బలగాల కవాతు-ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూలు జిల్లా ఎస్‌పిఇజి. కష్ణ కాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు. కర్నూలు మూడవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని కర్నూలు పట్టణంలోని అమ్మహాస్పిటల్, సాంస్కృతి పార్క్, డాక్టర్స్ కాలనీలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు త్రీ టౌన్ ఎస్ఐ వెంకటసురేష్ పోలీసు సిబ్బంది ఉన్నారు. ఆదోని రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఆదోని పట్టణంలో భీమా సర్కిల్ , ఫరిద్ సాహెబ్ మొహల్లా, మట్కగేరి, చిన్న మార్కెట్, చాంద్ సౌదర్గా, ఎస్‌కెడి కాలనీలలో కవాతు నిర్వహించారు. ఎస్ఎస్‌బి అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, ఆదోని టూ టౌన్ సిఐడి. గోపి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంతరత్నం

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కోడుమూరులో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం తెలిపారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోడుమూరు నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా అనంతరత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ టికెట్టు ఎవరికి వచ్చినా అందరూ కలిసికట్టుగా పని చేయాలని అధిష్టానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. కోడుమూరులో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించు కొని మన సత్తాచాటాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. బిజెపి, వైసిపి, టిడిపిలకు ఓట్లు వేసినా ఎస్సీలకు స్వేచ్ఛ ఉండదని , కాంగ్రెస్ పార్టీలో మాత్రమే అందరికీ స్వేచ్ఛ స్వతంత్రం ఉంటుందన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్‌ప్రమీల, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఇ లాజరస్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం జి.ఎర్రగుడి, మిద్యతండా, బొల్లావానిపల్లి, బాటతండా, రోళ్ళపాడు తండా, కడమకుంట్ల తదితర గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను గురువారం పత్తికొండ ఆర్‌డిఒ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి పరిశీలించారు. ఆర్‌డిఒ రామలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల రోజు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందువల్ల గ్రామస్తులు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఓటర్ రహస్యంగా ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. అందువల్ల ప్రతి ఓటర్ నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, విఆర్‌ఒలు రంగప్ప, గోవిందప్ప, రంగన్న, లక్ష్మి, ఆర్‌డిఒ ఆఫీస్ సిఒ రవి పాల్గొన్నారు.



వడదెబ్బ లక్షణాలు ప్రథమచికిత్స

జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సలహాలు సూచనలు


ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : 'ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మనిషి శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్ర మండల నాడీ వ్యవస్థ దెబ్బ తినడం వలన వడదెబ్బ వస్తుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40 శాతం మరణాలు సంభవిస్తాయి. ఇది చాల ప్రమాద కరమైనది. వేసవికాలంలో సాధారణంగా అపా యానికి గురి చేసేది వడదెబ్బ దానికి సన్‌స్ట్రోక్ లేదా హీట్ స్ట్రోక్ అంటారు. తీవ్ర స్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. కనుక వడ దెబ్బ తగిలిన వ్యక్తికి తక్షణమే వైద్య సహాయం అందించాలి.' అని జల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో....

వడబెద్దలక్షణాలు

తలనొప్పి, తలతిరగడం, నాలుక ఎండి పోవడం, పిడచ కట్టుకుపోవడం,చెమట పట్టుకుండుట, ఎండి పోయిన చర్మంతో ఎక్కువ జ్వరం రావడం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి.

కారణాలు-జాగ్రత్తలు

శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఎక్కువ ఉష్ణాన్ని కోల్పోవడం, చేయవలసిన పనులు... వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. అతని శరీరం పై వుండే దుస్తులను తొలగించి చల్లని నీటితో కడగడం, చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఐస్ ముక్కలను గుడ్డతో ఉంచి శరీరాన్ని తుడిచి, చల్లని గాలి తగిలేలా చూడాలి. రోగస్తులకు చల్లని నీరు లేదా ఉప్పు , ఇతర లవణాలు కలిపిన నీటిని లేదా ఒఆర్ఎస్ ద్రావకాన్ని తాపించాలి. అయితే ఇవన్నీ భాదితుని డాక్టరుకు చూపించే లోగా చేయవలసిన చర్యలు స్పృహ కోల్పోతే మాత్రం వైద్యులను సంప్రదించాలి



వడదెబ్బకు ఎక్కువగా గురయ్యేవారు

ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలు, 50 సంవత్సరాలపై బడినవారు. తమ ప్రయాణాలలో ఒఆర్ఎస్ ప్యాకెట్స్ వెంట తీసుకొనివెళ్ళాలి. వేడిమి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనిచేయడం ఉదారణ హోటల్స్, వంటగదుల్లో పనిచేసేవారు. కార్మికులు, రైతులు, నిర్మాణపనులు, ఇటుక బట్టీలలో పనిచేయువారు, రక్షకభటులు, రోడ్డుప్రక్కన వ్యాపారం చేయు చిరువ్యాపారులు ఎండలో ప్రయాణం చేసేవారు. గర్భిణీలు , పాలిచ్చే తల్లులు, అప్పుడే పుట్టిన పిల్లలు, పసిపిల్లలు,ముఖ్యంగా రేకుల షెడ్డులో నివసించేవారు అధిక జాగ్రతలు తీసుకోవాలి. అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదా గుండెజబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం కలవారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు

సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో 12 గం. నుండి 4 గం. వరకు తిరగకుండా జాగ్రత్త వహించాలి. తప్పని సరిగా బయటకు వెళ్ళవలసిన పరిస్థితులలో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ళ రసాలు తాగి బయలుదేరాలి. వేసవి కాలంలో తెల్లని దుస్తులు ధరించాలి. నల్లని వస్త్రాలు ధరించకూడదు. ఆల్కహాల్ సేవించడం వల్ల రక్త నాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దోహదం చేస్తుంది. కనుక ఆల్కహాల్ సేవించరాదు. ఇంటి గదులు ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీలకు తలుపులకు తెరలను వాడి వేడిని తగ్గించవచ్చును. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు. ఎయిర్ కండిషనర్లు వాడాలి. వేడిగా ఉన్నపుడు ఎండలో గొడుగు లేకుండా తిరుగరాదు. తప్పనిసరి పరిస్థితులలో మండుటెండలో బయటికి వెళ్ళాలంటే మంచి నీటి బాటిల్‌ను వెంట తీసుకోని వెళ్ళాలి. వేసవికాలంలో బయటకు వెళ్ళే అవసరం ఉంటే ఉదయం, సాయంత్రం సమయాలలో వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి. తలకు తెల్లని టోపీ లేక రుమాలు లేకుండా ఎండలో తిరుగరాదు. వడదెబ్బకు గురి అయిన వారు కోలుకుంటున్న లక్షణాలు లేనిచో శీతల వాతావరణంలో దగ్గరలోని హాస్పిటల్ చేర్చటంలో ఏ మాత్రం ఆలస్యం చేయరాదు.



పేద ముస్లిము మహిళలకు గొడుగులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

పేద ముస్లిము మహిళలకు గొడుగులు పంపిణీ

సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వేసవి మండుటెండలలో తప్పనిసరయి బయటికి రావాల్సి వస్తే ఎండనుండి ఉపశమనంపొందేందుకు సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకరశర్మ పేద ముస్లిము మహిళలకు గొడుగులు పంపిణీ చేశారు. కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్లోనక్లినిక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవి మండుటెండల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకి రావద్దని సూచించారు. ముఖ్యంగా పేద ప్రజలు పనిచేస్తే తప్ప పూట గడవదని అలాంటివారు బయటికి రావాలంటే వడదెబ్బకు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సొంత లాభాన్ని కొంత మానుకొని పొరుగు వారికి సేవ చేయాలన్న సూక్తిని పాటిస్తూ పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని వివరించారు. పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లిం మహిళలు ఎండ వేడిమి గురి కాకుండా వీలుగా గొడుగులను పంపిణీ చేశానన్నారు. ఎండ వేడికి గురి కావడం వల్ల శరీరంలో నీటి శాతం తక్కువ కావడం, ఎలక్ట్రోటలైట్స్ లోపించడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఎండాకాలంలో కలుషితమైన నీటిని తాగడం వల్ల విరోచనాలు ,గ్యాస్ట్రో ఎంటరైటిస్, కలరా టైఫాయిడ్, జాండీస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు .ముఖ్యంగా బిపి, షుగర్ వంటి జబ్బులతో బాధపడే వారితో పాటు వృద్ధులు, చిన్న పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సి బెళగల్



మండలంలోనీ మోడల్‌స్కూల్ వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఒక మహిళకు, ఒక పురుషుడికి తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. గురువారం చింతమాను పల్లెకి చెందిన ప్రతాప్‌రెడ్డ, వారి బంధువు నర్సమ్మ మరొకరు ఇలా ముగ్గురు కలిసి బైక్‌పై కంభదహాల్ కు వెళ్తున్నారు. మోడల్ స్కూల్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించపోయి, ఆర్‌టిసి బస్సు బైకు అదుపు తప్పి వారి మీదకు వచ్చింది. దీంతో తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- వెముగోడు సచివాలయం ముందు గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - గోనెగండ్ల



ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని వెముగోడు గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామస్తులు ఖాళీ బిందెలతో సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. వేసవి దృష్ట్యా హంద్రీ నదిలో వేసిన బోర్లు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. గ్రామంలో తాగునీటి నమస్య నెలకొందన్నారు. అధికారులు స్పందించి ఎల్ఎల్సి ద్వారా నీటిని హంద్రీలోకి వదిలితే బోర్లలో భూగర్భ జలాలు పెరగడంతోపాటు గ్రామంలో తాగునీటి సమస్య తీర్చినట్లు అవుతుందని తెలిపారు. వెంటనే ఎల్ఎల్సి ద్వారా హంద్రీలోకి నీటిని విడుదల చేయాలని కోరారు. గ్రామస్తులు వెంకటేశ్వర్లు, చిరంజీవి, శ్రీనివాసులు, ఓబులేసు, ఈరన్న, రాము, లక్ష్మణ్ నాయుడు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేయండి

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బుట్టా రేణుక

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక కోరారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభను వైసిపి కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆడపిల్లల చదువును ప్రోత్సహిద్దాం

- సిడిపిఒ మద్దమ్మ, ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నేటి సమాజంలో ఆడపిల్లలను తక్కువ చూపు చూడకుండా వారు ఎన్నుకున్న దారిలో ప్రోత్సహిద్దామని ఆలూరు సిడిపిఒ మద్దమ్మ, చిప్పగిరి ఎంఇఒ సావిత్రమ్మ బాలికల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో 'భేటీ బచావో.. బేటీ పడావో' అంగన్వాడీ టీచర్లు, పలు పాఠశాలలకు చెందిన బాలికల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం బాలికలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించడానికి ఎన్నో పథకాలను తీసుకొచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడ బాల్య వివాహాలు చూస్తున్నామని, అలా జరగకుండా బాలికల తల్లిదండ్రులకు పూర్తి అవగాహన పెంచే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు కొడుకుతో సమానంగా కూతురిని చూడాలని, చదువులో ఇద్దరికీ పోటీ ఉండేలా ఎవరు బాగా చదువుకుంటారనే దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - నందవరం



వాల్మీకి పటాన్ని ఊరేగిస్తున్న వాల్మీకి పెద్దలు

మండలంలోని కనకవీడు గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. గత కొన్నేళ్లుగా విగ్రహాన్ని ఆవిష్కరించాలని కృషి చేశారు. నేడు వాల్మీకుల సమిష్టి కృషితో వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన దిగ్విజయంగా ముగిసింది. కనకవీడులో దాదాపు 2 వేల జనాభా ఉండగా ఒకే కుటుంబం లాగా అందరూ కలిసి పండగను జరుపుకున్నారు. వాల్మీకి విగ్రహాన్ని తెల్లవారుజామున 5 గంటలకు పూజ, కుంకుమార్చన, పూజలు చేశారు. అలాగే అన్నదానం ఏర్పాటు చేశారు.

బార్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు వాయు జీవోత్తమ రావు, షేక్షావలీకి గురువారం బార్ ఆవరణలో ఆలూరు జర్నలిస్టులు పూలమాల వేసి సన్మానించారు. బార్ అధ్యక్షులు వాయు జీవోత్తమరావు మాట్లాడారు. సమాజంలో నాలుగో స్తంభంగా విధులు నిర్వహిస్తూనే తమ న్యాయవాదులను ప్రోత్సహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. న్యాయవాదులు లక్ష్మీకాంత్, ప్రవీణ్ కుమార్, రవి, షాకీర్, చాంద్ బాషా, జర్నలిస్టులు రాజేష్, కృష్ణ, స్వరూప్, సాహెబ్ జాన్, రాంప్రసాద్, అంజి, వీరేష్ పాల్గొన్నారు.

నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటి

- ప్రజలకు క్షమాపణ చెప్పి ఎమ్మిగనూరులో పర్యటించండి - జగన్‌కు మాజీ ఎమ్మెల్యే బీవీ హితవు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ

నియోజకవర్గానికి వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఏమిటో చెప్పి, ప్రజలకు క్షమాపణ చెప్పి పర్యటించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 29న ఎమ్మిగనూరులో పర్యటిస్తున్నారని తెలిపారు. గతంలో పర్యటించినప్పుడు కూడా ఆయనను సూటిగా కొన్ని ప్రశ్నలు వేసినా ఇప్పటి వరకు సమాధానం చెప్పలేదని అన్నారు. గతంలో టిడిపి హయాంలో సుమారు రూ.2 వేల కోట్లతో మంజూరు చేయించిన ఆర్‌డిఎస్ ప్రాజెక్టును పూర్తి చేశారా అని ప్రశ్నించారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి రూ.144 కోట్లతో గాజులదిన్నె నుంచి పైపులైన్ పనులు పూర్తి చేశారా అని నిలదీశారు. సుమారు 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 94 ఎకరాల్లో మంజూరు చేసిన టెక్స్ టైల్స్ పార్కును పూర్తి చేశారా అని ప్రశ్నించారు. పట్టణంలో రోడ్ల నిర్మాణానికి టిడిపి హయాంలో తెచ్చిన రూ.30 కోట్లు వెనక్కి పంపించేశారని విమర్శించారు.

సీనియర్ కార్యకర్తలకు సన్మానం

టిడిపి స్థాపించిన రోజు నుంచి పార్టీలో ఉన్న సీనియర్ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఘనంగా సన్మానించారు. పట్టణంలోని తన స్వగృహంలో సీనియర్ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలో సీనియర్ నాయకులు మాబుసాబ్, రఘుమూర్తి స్వామి, లియాఖత్ అలీ, మిఠాయి నరసింహులు, కొండయ్య చౌదరి, ఇబ్రహీం, షరీఫ్, దామా నరసింహులు, హాజి బడేసాబ్, నబీసాబ్, శంకరన్న, ఉసేన్ సాబ్, వెంకటకృష్ణమ నాయుడు, మాబు, రజాక్, అల్లాబకాష్, మాబును శాలువా, పూలమాలలతో సన్మానించారు.



సీనియర్లను సన్మానిస్తున్న బీవీ

'రన్ ఫర్ జీసస్'ను విజయవంతం చేయండి

- కరపత్రాల విడుదల

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ, గ్రామీణ ప్రాంత సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30న ఉదయం 6 గంటలకు నిర్వహించే 'రన్ ఫర్ జీసస్'ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. గురువారం ఆదోనిలోని సిఎస్ఐ చర్చిలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... బైపాస్ రోడ్డులో మహిమ ప్రార్థన మందిరం నుంచి ప్రారంభమై కొత్త బస్టాండ్ మీదుగా ఎమ్మిగనూరు సర్కిల్, నిర్మల్ టాకీస్, భీమా సర్కిల్, శ్రీనివాస భవన్, రాజశేఖర్ రెడ్డి విగ్రహం మీదుగా సిఎస్ఐ చర్చి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. క్రైస్తవ సంఘాల గురువులు, పాస్టర్లు, సేవకులు, సంఘ పెద్దలు, మహిళలు, యువత ర్యాలీలో పాల్గొనాలని కోరారు. దేశ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలన్నారు. రెవరెండ్ భాస్కర్, సునీల్ రాజ్‌కుమార్, శాంత కుమార్, పాస్టర్లు బెనర్జీ రాజు, శాంతన్న, ఫిలిప్, ఆశీర్వాదం, మనోహర్, డేవిడ్ రాజ్, శరత్ బాబు, దేవదానం, చిన్న, మునెప్ప, విల్సన్, జయపాల్, జాన్, థామస్, జకరయ్య, నాగేష్, ఇమ్మానుయేల్, బర్ణబా పాల్గొన్నారు.

చలివేంద్రాల నిర్వహణకు దాతలు ముందుకు రావాలి

- మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పాదచారుల దాహార్తి తీర్చేందుకు విరివిగా చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. గురువారం ఆవోపా ఆధ్వర్యంలో అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ సౌజన్యంతో ఆదోని మున్సిపాలిటీ ప్రాంగణంలో మినరల్ వాటర్ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషన్ రామచంద్ర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రజలు నీటిని దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. దాతలు ముందుకొస్తే మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలు కూడా ఇవ్వడానికి కృషి చేస్తామని మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు బూదూరు సంగీత, వంకదారు మమతా తెలిపారు. కార్యదర్శి మరియాల శ్రీధర్, సభ్యులు ప్రతాప్, ఈరన్న శెట్టి, రఘు, కిరణ్, ఎఎస్ఎం.ప్రసాద్, వై.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, బద్రినాథ్, గిరిధర్, వంకదారి గీత, పరిమళ పాల్గొన్నారు.

ఒటిఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తి, ఖాళీ జాగా బకాయి పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపునకు వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం చెల్లింపునకు మూడు రోజులు మాత్రమే గడువు ఉందని పేర్కొన్నారు. ఒకేసారి బకాయిలు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

నిరుద్యోగులను మోసం చేసిన

జగన్ సభకు ఎవరూ రావద్దు

- జిల్లాలో కురువలకు ఒక్క సీటు కూడా ఇవ్వని జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- కర్నూలు పార్లమెంట్ కురువ సాధికారిక సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్



నిరుద్యోగులను మోసం చేసిన జగన్మోహన్‌రెడ్డి 'మేము సిద్ధం' బహిరంగ సభకు ఎవరూ రావద్దని కర్నూలు పార్లమెంట్ కురువ సాధికారిక సభ్యులు తిమ్మాపురం కెటి.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో లక్షల మంది విద్యార్థులు మెగా డీఎస్సీ కోసం ఐదేళ్లుగా ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. ఎమ్మిగనూరులో జరిగే సభకు ఏ మొఖం పెట్టుకొని వస్తున్నారని జగన్‌ను ప్రశ్నించారు. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చి, అన్ని స్కీంలలో స్కాంలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కానీ కేటాయించని జగన్ ప్రభుత్వం కురువ సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూసిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి కురువలు కచ్చితంగా బుద్ధి చెబుతారని అన్నారు.

బాలనాగిరెడ్డితో మరింత అభివృద్ధి : ప్రియాంక రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే కుమార్తె ప్రియాంక రెడ్డి కోరారు. గురువారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తెచ్చి పాలన అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే చేపట్టిన పనుల వల్ల కాలనీలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యం వంటి అభివృద్ధి జరిగిందని చెప్పారు. అనంతరం శాంతి ధామా వృద్ధాశ్రమంలో వృద్ధులను కలిసి మే 13న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. అంతకుముందు గ్రామదేవత మంచాలమ్మను, శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రచారం ప్రారంభించారు. వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, పెట్రోలు బంక్ శీను, బొంబాయి శివ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, మండల సచివాలయ కో కన్వీనర్ వికెసి.రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

'మేము సిద్ధం' సభను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరులో జరిగే 'మేము సిద్ధం' సభను జయప్రదం చేయాలని ప్రియాంక రెడ్డి కోరారు. ఆమె మాట్లాడుతూ... నేడు ఎమ్మిగనూరు పట్టణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రియాంక రెడ్డి



పట్టుబడిన నిందితుడు

భారీగా బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని రైల్వే స్టేషన్‌లో భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ గురువారం తెలిపారు. ఆదోని రైల్వే స్టేషన్‌లో సిబ్బందితో గస్తీ తిరుగుతుండగా ఆదోనిలోని హవన్న పేటకు చెందిన ముల్లా మహ్మద్ బసవ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా అనుమానం వచ్చి సోదా చేశామన్నారు. బ్యాగులో రెండు బిస్కెట్ల బంగారం ముక్కలు లభించాయని, దీని విలువ సుమారు రూ.41.30 లక్షలు ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామని తెలిపారు.

ఆదోనిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - ఆదోని

రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా డీఎస్పీ శివ నారాయణ స్వామి పర్యవేక్షణలో గురువారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్, ఎస్ఎస్‌బి పోలీసులు ఆదోనిలోని భీమాస్ సర్కిల్, ఫరీద్‌షా మోహల్లా, మట్కారికిగేరి, చిన్న మార్కెట్, చందసాదర్గా మీదుగా ఎస్‌కెడి కాలనీలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు భరోసా కల్పించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశ్యమని డీఎస్పీ తెలిపారు. ఎస్ఎస్‌బి అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, టూ టౌన్ సిఐ గోపి పాల్గొన్నారు.

బాబు ఆదేశం మేరకు పార్టీ కోసం పని చేస్తాం

- టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని సీటు తనకు రాకపోవడంపై తన కంటే చంద్రబాబు నాయుడు ఎంతో బాధపడ్డారని, తాను ఆయనను కలిసినప్పుడు ఎంతో బాధతో నచ్చజెప్పారని, అందుకే చంద్రబాబు ఆదేశం మేరకే తాను పార్టీ కోసం పని చేస్తానని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. గురువారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పొత్తులు ఏర్పడిన వెంటనే ఆదోని అసెంబ్లీ స్థానాన్ని బిజెపి అధిష్టానం కోరిందని, పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఆదోని సీటును బిజెపికి త్యాగం చేయాల్సి వచ్చిందని అధినేత చంద్రబాబు వివరించారని తెలిపారు. టిడిపి పుట్టినప్పటి నుంచి తాను పార్టీలో కొనసాగుతున్నానని, ఏనాడూ తాను అధిష్టానం ఆదేశాలను బేఖాతరు చేయలేదని చెప్పారు. తన తుదిశ్వాస వరకు పార్టీ కోసం పని చేస్తానని, అలాగే టిడిపి నాయకులు, కార్యకర్తలు కూడా పని చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన కురువ లక్ష్మన్న (54)ను భార్య హత్య చేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. సిఐ శ్రీనివాసులు వివరాల మేరకు... పత్తికొండ మండలం చక్రాల గ్రామానికి చెందిన బోయ మల్లయ్యతో కురువ పద్మావతి వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నారు. విషయం తెలుసుకున్న పద్మావతి భర్త కురువ లక్ష్మన్న గొడవ పడేవారు. వేధింపులు భరించలేక కురువ పద్మావతి తన కుమారుడు కురువ వెంకటేష్‌తో 'మీ నాన్న నన్ను అనవసరంగా అనుమానిస్తున్నాడు. మన కుటుంబ మర్యాదపోతుంద'ని లక్ష్మన్నపైన రెచ్చగొట్టింది. కుమారడు వెంకటేష్, ప్రియుడు బోయ మల్లయ్యతో కలిసి లక్ష్మన్నను చంపాలని పథకం వేశారు. ఫిబ్రవరి 17న రాత్రి నిద్రమాత్రల పొడి చిత్రన్నంలో కలిపి లక్ష్మన్నకు పెట్టింది. కురువ లక్ష్మన్న ఇంట్లో నిద్రలో ఉండగా రాత్రి 11 గంటలకు ముగ్గురు కలిసి కురువ లక్ష్మన్న గొంతును తాడుతో బిగించి హత్య చేశారు. కేసులో నుంచి తప్పించుకోవాలని మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి అనంతపురం జిల్లా, పామిడి మండలంలో గల ఎన్‌హెచ్-44 రోడ్డులో ఉన్న పెన్నానది ఒడ్డున ఉన్న చెట్లపొదల్లో పడేశారు. లక్ష్మన్న కనబడడం లేదని ఈనెల 15న దేవనకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించి నిందితులైన కురువ పద్మావతి, కురువ వెంకటేష్, బోయ మల్లయ్యను గురువారం అరెస్టు చేశారు. కురువ లక్ష్మన్న మృతదేహాన్ని కనిపెట్టి, పోస్టుమార్టం నిర్వహించినట్లు సిఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా పత్తికొండ న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న సిఐ

సమస్యలు పరిష్కరిస్తాం

- హాలహర్విలో టిడిపి ఎంపీ అభ్యర్థి నాగరాజు పర్యటన

ప్రజాశక్తి - హాలహర్వి

తాము అధికారంలోకి వస్తే జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని టిడిపి ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు తెలిపారు. గురువారం ఆయన హాలహర్విలో పర్యటించారు. ముందుగా అంబేద్కర్, వాల్మీకి, కనకదాసు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. గూళ్యం గ్రామంలో వెలసిన శ్రీశరణ గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి 25 పార్లమెంటు స్థానాలను గెలుస్తుందని తెలిపారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, తాగు, సాగునీటి సమస్యలు, వలసలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. కర్నూలు పార్లమెంట్ నుంచి టిడిపి జెండాను ఎగురవేస్తామన్నారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

ఆలూరు : ఆలూరు ప్రాంత ప్రజలకు సాగు, తాగు నీరు అందించడమే తన లక్ష్యమని టిడిపి కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు తెలిపారు. గురువారం ఆలూరు పర్యటనలో భాగంగా శ్రీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అంబేద్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు ప్రాంత ప్రజలు తనకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని తెలిపారు. శశికళ కృష్ణ మోహన్, బత్తిన లక్ష్మీనారాయణ, పెద్ద హరివాణం దేవేంద్రప్ప, నరసప్ప, సురేంద్ర, కురువ జయరాం పాల్గొన్నారు.



హాలహర్విలో ప్రచారం నిర్వహిస్తున్న నాగరాజు

గురుకుల ప్రవేశ పరీక్షల్లో

అనాథ విద్యార్థుల సత్తా

- 12 మంది పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీ గల పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీలో చదువుతున్న తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థులు, పొట్టకూటి కోసం వలసలకు వెళ్లిన వారి పిల్లలు సత్తా చాటారు. మొత్తం 20 మంది విద్యార్థులు హాజరవ్వగా 12 మంది విద్యార్థులు సత్తాచాటారు. గురువారం ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ప్రతిభాభారతి, నిర్వాహకులు నరసన్నలు సొసైటీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు పురుషోత్తం, అర్లప్ప, శ్రావణ్ కుమార్‌ను అభినందించారు. సత్తా చాటిన విద్యార్థులను కమిటీ నిర్వాహకులతో పాటు వారి కుటుంబ సభ్యులు అభినందించారు. కమిటీ సభ్యులు నాగరాజు, తిరుపతి, ప్రసాద్, మనోహర్ పాల్గొన్నారు.

మహాత్ముల జయంతులను

అధికారికంగా నిర్వహించాలి

- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు దేవి ప్రసాద్

ప్రజాశక్తి - ఆదోని

మహాత్ముల జయంతిని అధికారికంగా నిర్వహించాలని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఆర్.దేవి ప్రసాద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జైభీమ్ సాయిరామ్ డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కర్నూలు నగరంలో కలెక్టర్ నిర్వహిస్తున్న మాదిరి ఆదోని డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించాలని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల బాలస్వామి, మండల అధ్యక్షులు గిడ్డయ్య, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కాటి పోగురాజు, దళిత సంక్షేమ సంఘం అడ్వయిజర్, న్యాయవాది చంద్రయ్య, జిల్లా నాయకులు పిఎస్.వీరేష్, జగన్నాథ్, ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, ఎంఆర్‌పిఎస్ పట్టణ ఇన్‌ఛార్జీ మణికంఠ, నాయకులు దిబ్బెనకల్ ఉసేనప్ప, ఆంజనేయులు, మాల మహానాడు టౌన్ ప్రెసిడెంట్ బొబ్బిలి, ఎంఎస్‌పి నాయకులు రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై సమీక్ష

ప్రజాశక్తి - మంత్రాలయం

పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలపై ఎఇఆర్ఒ శ్రీధర్ మూర్తి బిఎల్ఒలు, బిఎల్ఒల సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సంసిద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన లైటింగ్, ఫాన్స్, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు, ర్యాంప్స్ నిర్మాణం, తదితర సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. స్వీప్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంల విధుల గురించి వివరించి నిఘా ఉంచాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గురురాజారావు, డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్ర, ఆర్ఐ ఆదాము పాల్గొన్నారు.

ప్రతి స్కీంలోనూ స్కాం...

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలను ప్రకటించి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రతి స్కీం లోనూ స్కాం చేశారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు 'నిన్ను ఎందుకు ఓడించకూడదో తెలపాల'ని నిలదీశారు. మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పి 'జె' బ్రాండ్స్ తెచ్చి ప్రజల ప్రాణాలు తీస్తున్న నిన్ను ఓడించక తప్పదు జగన్ రెడ్డి అని తెలిపారు. విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తానని మాట ఇచ్చి మడమ తిప్పిన జగన్‌ను ఓడించక తప్పదన్నారు. ఇసుక అక్రమ తరలింపు హామీని తలకిందులు చేసి భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టిన జగన్‌ను ఓడించడం ఖాయమన్నారు. రూ.లక్ష కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి సామాజిక న్యాయం పేరుతో మోసం చేశారని విమర్శించారు. పేదల పెన్నిధి చంద్రన్నను అక్రమంగా 53 రోజులు జైలులో ఉంచిన జగన్‌ను ఓడించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇటు ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలనాగి రెడ్డిని ఓడించడానికి ప్రజలు ఎప్పుడో సంసిద్ధమయ్యారని పేర్కొన్నారు.

కోసిగి : రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమితోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. కోసిగిలోని ఆంజనేయ స్వామిని, బీరలింగేశ్వర స్వామిని దర్శించుకొని ఇంటింటికీ ప్రచారం మొదలుపెట్టారు. 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఒక ఓటు ఎమ్మెల్యే అభ్యర్థికి, మరో ఓటు ఎంపీ అభ్యర్థికి వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉల్లిగయ్య, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, ఎన్.రామకృష్ణ, అరివిలి వీరేష్, జనసేన హనుమేష్, మధు, టిడిపి నాయకులు సాతనూర్ కోసిగయ్య, పువ్వులు తిక్కయ్య, సొట్టయ్య, చింతలగేని నర్సిరెడ్డి, పోతుల వీర రెడ్డి, పల్లెపాడు శంకరయ్య, వీరేష్, పూల శేఖర్ పాల్గొన్నారు.



కోసిగిలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న రాఘవేంద్ర రెడ్డి